'కల్యాణ లక్ష్మి' ప్రపంచంలోనే ఒక చరిత్ర

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ(సిరికొండ), జూలై 15 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం ప్రపంచంలోనే ఒక చరిత్ర అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం సిరికొండ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పది మంది లబ్ధిదారులకు కేసీఆర్ మంజూరు చేసిన రూ.1,00,116 చొప్పున రూ.10,01,160 విలువ గల కల్యాణలక్ష్మి చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు సూర్యకాంతి, పెంటన్న, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి..

మైసమ్మ గుడి వద్ద పూజలు చేస్తున్న మాజీ మంత్రి రామన్న

జైనథ్, జూలై 15 : ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సోమవారం కాప్రి గ్రామంలో మైసమ్మ గుడి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాప్రి గ్రామం ఆధ్యాత్మికతకు నిలయమని, యువత సన్మార్గంలో నడుచుకుని చెడు వ్యసనాలకు దూరంగా ఉండి గ్రామాభివృద్ధికి తోడ్పాటు నందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మార్నెట్టి గోవర్ధన్, నాయకులు లింగారెడ్డి, ప్రభాకర్, పురుషోత్తం యాదవ్, భోజన్న, సంతోష్‌రెడ్డి, ఊశన్న, ఎల్టీ వెంకట్‌రెడ్డి, ఊశన్న, రాంరెడ్డి, గణేశ్ యాదవ్, రామన్న, పురుషోత్తంరెడ్డి, బట్టు సతీశ్ పాల్గొన్నారు.

మందుల్లేవ..

ప్రభుత్వ దవాఖానల్లో టాబ్లాయిడ్స్ కొరత

- కనీసం జ్వరం, జలుబు కూడా దొరకని దుస్థితి
- ప్రిస్క్రిప్షన్ తీసుకెళ్తే బయట తీసుకోవాలని సూచిస్తున్న ఫార్మసి సిబ్బంది
- రోగులపై మోయలేని ఆర్థిక భారం

నిర్మల్‌లోని ప్రభుత్వ దవాఖానలో గల మందుల దుకాణం వద్ద ఓపీ రోగులు

నిర్మల్, జూలై 15(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లావ్యాప్తంగా ఆరేడు నెలలుగా సర్కారు దవాఖానల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. ప్రధానంగా జిల్లా ప్రధానాసుపత్రితోపాటు, భైంసా, ఖానాపూర్ ఏరియా ఆసుపత్రులు, అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ అన్ని రకాల మందులు లేవని రోగులు పేర్కొంటున్నారు. కుభీర్ పీహెచ్‌సీలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల మందులు అందుబాటులో లేవని సిబ్బంది పేర్కొంటున్నారు. ఆసుపత్రుల్లో వైద్యులు చికిత్సలు నిర్వహిస్తున్నప్పటికీ, ఆ చికిత్సలకు అవసరమైన మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేని కారణంగా రోగులు ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేవని రోగులు పేర్కొంటున్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మందులకు నిధులు మంజూరు చేయకపోవడంతో కొరత ఏర్పడిందని చెబుతున్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలకు ఆదిలాబాద్‌లోని జిల్లా డ్రగ్స్ స్టోర్ నుంచి మందులు వస్తాయి. మందులు అందుబాటులో లేకపోవడంతో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఉన్న మందులతోనే సరిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లా ప్రధాన ఆసుపత్రితోపాటు, ఖానాపూర్, భైంసా ఆసుపత్రుల్లో గ్లూకోజ్(సెలైన్) బాటిళ్లతోపాటు ఐవీ సెట్లు, సిరంజీలు, ఇతర యాంటీ బయోటిక్ డ్రగ్స్ కొరత తీవ్రంగా ఉందని ఆరోగ్య సిబ్బంది అంటున్నారు. నిర్మల్‌లోని జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఎన్ఎస్ 100 ఎంఎల్, ఐవీ సెట్లు, సర్జికల్ కిట్స్‌తోపాటు, పలు చికిత్సలకు వినియోగించే మందులు అందుబాటులో లేవు. వైద్య సిబ్బంది రాసిచ్చిన సర్జికల్ సామగ్రితోపాటు మందులను సొంత ఖర్చులతో రోగులు ప్రైవేటులో కొనుగోలు చేస్తుండడంతో ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మందుల కొనుగోలు కోసం నిధులను విడుదల చేయకపోవడంతోనే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందన్న వాదనలు ఉన్నాయి. వైద్య రంగానికి పెద్ద ఎత్తున ప్రాధాన్యతనిస్తున్నామని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాలు మందుల కొరతపై సమీక్షలు కాని, అవసరమైన చర్యలు తీసుకోకపోవడం రోగుల ఆగ్రహానికి కారణమవుతున్నది. కాగా.. జిల్లా ఆసుపత్రుల్లో మందుల కొరతపై జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ధన్‌రాజ్‌ను ఫోన్‌లో సంప్రదించగా జిల్లాలో మందుల కొరత లేదని తెలిపారు.

రూ.200 పెట్టి మందులు కొన్న..

నాకు శరీరంలో వాపులు రావడంతో నిర్మల్‌లోని పెద్దాసుపత్రిలో చేరిన. తొమ్మిది రోజుల నుంచి చికిత్స అందిస్తున్నరు. ఇంకా తగ్గలేదు. ఎందుకు తగ్గత లేదు అని డాక్టర్లను అడిగితే కొన్ని మందులు ఇక్కడ లేవు. బయట నుంచి తెచ్చుకోమన్నరు. దీంతో ఈ రోజు బయట ఉన్న ప్రైవేటు మందుల దుకాణంలో రూ.200 పెట్టి మందులు కొనుక్కొని వచ్చిన. ఇప్పుడున్న వాపులు తగ్గుతాయేమో చూడాలి.

- జాదవ్ కిషన్, పేషెంట్, బిలావర్‌పూర్

అక్రమ డిప్యూటేషన్లపై నిరసన తెలుపుతున్న డీటీఎఫ్ నాయకులు

విద్యాశాఖలో పైరవీల జోరు

అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి

- కలెక్టర్‌కు ఉపాధ్యాయ సంఘం ఫిర్యాదు
- రీ నోటిఫికేషన్‌కు కలెక్టర్ ఆదేశం

ఆదిలాబాద్, జూలై 15(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయం పైరవీలకు నిలయంగా మారిందని, ఇటీవల ఆదిలాబాద్ క్రీడా పాఠశాలలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు అంటూ ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నారు. జిల్లా విద్యాధికారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి క్రీడా పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించారంటూ డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు సోమవారం కలెక్టర్ రాజర్షి షాకు ఫిర్యాదు చేశారు. క్రీడా పాఠశాలలో అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేసి ఇందుకు కారణమైన డీఈవోపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డిప్యూటేషన్ల వ్యవహారం

జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలలో డిప్యూటేషన్లపై పనిచేయడానికి జిల్లా విద్యాధికారి ఈ నెల 2న దరఖాస్తులు ఆహ్వానించారు. స్కూల్ అసిస్టెంట్ ఏడు పోస్టులు, ఎస్జీటీలు రెండు, పీఈటీ లేదా పీడీ ఉపాధ్యాయుల కోసం ప్రకటన జారీ చేశారు. పది పోస్టులకు 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆయా పాఠశాలల్లో పనిచేస్తూ సర్‌ప్లస్ ఉన్న ఉపాధ్యాయులు ఇందుకు అర్హులుగా కాగా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు ఎన్‌వోసీ ఇవ్వాల్సి ఉంటుంది. కొందరు నిబంధనల మేరకు, మరికొందరు సర్‌ప్లస్ లేకుండా దరఖాస్తు చేసుకున్నారు. పాఠశాలలో డిప్యూటేషన్ల కోసం పెద్ద ఎత్తున పైరవీలు చేశారనే విమర్శలు వచ్చాయి. సీఎం పేషీలో పనిచేసే ఓ వ్యక్తితోపాటు జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి ఈ వ్యవహారంలో తలదూర్చడం, సంఘాల నేతలు పైరవీలు చేశారనే ఆరోపణలు వచ్చాయి.

నియామకంపై అనుమానాలు

దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు పరిశీలించి అర్హులైన వారిని క్రీడా పాఠశాలలో డిప్యూటేషన్లపై నియమించాల్సి ఉండగా డీఈవో నిబంధనలు పాటించలేదని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి ఏడుగురు ఉపాధ్యాయులను నియమించగా ఇందులో ఇద్దరు మాత్రమే అర్హులుగా ఉన్నారని, మిగతా వారి విషయంలో అధికారులు పైరవీలకు పెద్దపీట వేసినట్లు వారు చెబుతున్నారు. ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులకు ఒకరు అవసరం ఉంటే ఇద్దరిని నియమించారని, ఇందుకు సర్‌ప్లస్ లేని పాఠశాలల విద్యార్థులు నష్టపోవాల్సి వస్తుందని డీటీఎఫ్ నాయకులు తెలిపారు.

రీ నోటిఫికేషన్‌కు కలెక్టర్ ఆదేశాలు

క్రీడా పాఠశాలలో అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలంటూ డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడే ఉన్న జిల్లా విద్యాధికారి ప్రణితతో ఈ విషయంలో చర్చించిన కలెక్టర్ రాజర్షి షా రీ నోటిఫికేషన్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించిట్లు డీటీఎఫ్ నాయకులు తెలిపారు. డిప్యూటేషన్ల విషయంలో డీఈవో ప్రణిత వివరణ కోరగా కొందరి ఒత్తిడి మేరకు క్రీడా పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న డీటీఎఫ్ నాయకులు

అర్హులైన వారిని డిప్యూటేషన్లపై నియమించాలి..

తెలంగాణ క్రీడా పాఠశాలలో అర్హులైన ఉపాధ్యాయులను డిప్యూటేషన్లపై నియమించాలి. పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయుల నియామకంలో జిల్లా విద్యాధికారి నిబంధనలు పాటించకుండా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి, పైరవీలు చేసుకున్న వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. సర్‌ప్లస్ లేని పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించడం వల్ల గ్రామీణ ప్రాంతాల పాఠశాలల విద్యార్థులు నష్టపోతారు. డిప్యూటేషన్ల అక్రమాల విషయంలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేయగా రీ నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేపట్టాలని డీఈవోను ఆదేశించారు.

- జి. వృకోధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి, డీటీఎఫ్

సాగుకు 'కడెం' రెడీ

ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీరు

- పెరుగుతున్న ఇన్‌ఫ్లో
- ప్రారంభమైన బోటింగ్

కడెం, జూలై 15 : వానకాలం పంటలకు నీరందించడానికి కడెం ప్రాజెక్టు సిద్ధమైంది. ప్రాజెక్టు ఎగువన కురుస్తున్న వర్షాలతో వరద నీరు వచ్చి చేరుతుండడంతో నీటిమట్టం పెరుగుతూ వస్తున్నది. పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు(7.603టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 684.075 అడుగులు (4.145టీఎంసీల) వద్ద ఉంది. కాగా, సోమవారం ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి 877 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. అయితే రెండేండ్లుగా ప్రాజెక్టుకు భారీగా వరద నీరు రావడంతో ప్రాజెక్టు ముంపు నుంచి బయటపడ్డ విషయం తెలిసిందే. దీంతో అధికారులు ఈ వేసవి కాలంలో పనులు పూర్తి చేసి, వానకాలం పంట కోసం సిద్ధంగా ఉంచారు. అయితే పూర్తిస్థాయి నీటి మట్టానికి 16 అడుగుల దూరంలో ఉండడంతో మరో వారం రోజుల్లో పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు కింది ప్రాంతంలో రైతులు వరినార్లు పోసి సిద్ధంగా ఉంచడంతో కడెం ప్రధాన, కుడి కాలువల ద్వారా నీటిని విడుదల చేసే విషయమై వారంలోగా ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించి నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. కాగా.. ఈ వేసవిలో ప్రాజెక్టులో నీరు లేక డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో వేసవికాలం పూర్తిగా బోటింగ్ సేవలు నిలిచిపోయాయి. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు కడెం ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరుతుండడంతో తిరిగి బోటింగ్ సేవలను పునఃప్రారంభించినట్లు కడెం బోటింగ్ ఇన్‌చార్జి రమేశ్ తెలిపారు.

ఆర్జీయూకేటీ రెండో జాబితా విడుదల

బాసర, జూలై 15 : బాసర ఆర్జీయూకేటీ 2024-25 విద్యాసంవత్సరానికి గాను రెండో మెరిట్ జాబితాను విడుదల చేశారు. ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ వెంకటరమణ ఆదేశాల మేరకు రెండో జాబితాతోపాటు గ్లోబల్ కేటగిరీకి సంబంధించిన విద్యార్థుల ఎంపిక జాబితాను కూడా విడుదల చేశారు. ఎంపికైన వారికి ఈ నెల 19వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబితాను ట్రిపుల్ ఐటీ ఆఫీషియల్ వెబ్‌సైట్ www.rgukt.ac.inలో ఉంచినట్లు కన్వీనర్లు పావని, దత్తు తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా

ఎదులాపురం, జూలై 15 : అంగన్‌వాడీల శ్రమను అగౌరవ పరిచేలా ఉన్న జీవో నంబర్ 10ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పది రోజులుగా కలెక్టరేట్ ఎదుట రిలేదీక్షలు చేస్తున్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. టీచర్లకు రూ.2 లక్షలు, అయాలకు రూ.లక్ష పదవీ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో చర్చించి పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

జీవనభృతి ఇవ్వండి

కలెక్టరేట్ ఎదుట బీడీ కార్మికుల ధర్నా

ఎదులాపురం, జూలై 15 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి బీడీ కార్మికులకు రూ.4 వేల జీవనభృతి ఇస్తామని ప్రకటించిన విధంగా వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్ అన్నారు. బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఐఎఫ్‌టీయూ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌ను చెల్లించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన హామీని అమలు చేయడంతోపాటు పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలీ రేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బి.భూమన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యశివాజీ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరిత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

అర్జీదారులతో మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, జూలై 15 : గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం స్థానిక గిరిజన దర్బార్‌లో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను తెలుసుకున్నారు. ఇంద్రవెల్లి మండలంలోని సాలేగూడకు చెందిన హనుమంతు తనకు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలని, మంచిర్యాల జిల్లా కాసిపేట్ మండలంలోని మల్కపల్లికి చెందిన శశికళ తనకి ఇల్లు కావాలని, ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్‌కు చెందిన దేవన్న తన చికిత్స కొరకు ఆర్థిక సహాయం కల్పించాలని, ఉట్నూర్ మండలంలోని కుమ్మరితండాకు చెందిన మణికుమార్ బర్రెల కొనుగోలుకు రుణం మంజూరు చేయాలని, ఆదిలాబాద్ మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన సాయికృష్ణపై చదువుల కొరకు ఆర్థిక సహాయం అందించాలని అర్జీలు సమర్పించారు. ఇంకా.. ఉమ్మడి జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు వ్యవసాయ పనిముట్లు, రుణాలు, ప్రభుత్వ పథకాలైన పింఛన్లు, రెండు పడక గదుల ఇండ్లు, ఉపాధి, ఉద్యోగం విషయాలపై అర్జీలు పెట్టుకున్నారు. వాటిని పరిశీలించి సంబంధిత శాఖలకు బదిలీ చేశారు. ఈ దర్బార్‌లో డీడీ దిలీప్ కుమార్, ఏపీవో కనక భీంరావు, డీఎంజీసీసీ రామనందన్, జిల్లా అదనపు వైద్యాధికారి మనోహర్, ఏవో రాంబాబు, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు పాల్గొన్నారు.

భార్య గొంతు కోసి.. అదే కత్తితో తాను పొడుచుకుని..

సునీత(ఫైల్)

రోదిస్తున్న చిన్నారులు

జైనథ్(బేల), జూలై 15 : అనుమానం పెనుభూతంగా మారి కట్టుకున్న భార్యను కత్తితో పొడిచి, తనకు తాను కత్తితో పొడుచుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బేల మండలంలోని సైద్‌పూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనిమిదేండ్ల క్రితం సైద్‌పూర్ గ్రామానికి చెందిన ఎల్చాల లక్ష్మణ్, సునీత ప్రేమించుకుని కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఇదే గ్రామానికి చెందిన మరొకరితో తన భార్య అక్రమ సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో ముందుగా భార్య సునీత గొంతు కోసి హతమార్చాడు. అదే కత్తితో తాను పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న లక్ష్మణ్‌ను స్థానికులు 108 ద్వారా రిమ్స్‌కు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉంది. ఘటనా స్థలానికి డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ సాయినాథ్, ఎస్సై రాధిక చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. సునీత తండ్రి వసంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. తల్లి చనిపోవడం, తండ్రి ఆస్పత్రి పాలుకావడంతో చిన్నారులు దిక్కులేని వారయ్యారు.

నలుగురు పిల్లల గుర్తింపు

బాసర, జూలై 15 : బాసర రైల్వేస్టేషన్, ఆలయ పరిధిలో సోమవారం ఆపరేషన్ ముస్కాన్-10 భాగంగా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా బడి మానేసి వివిధ దుకాణాల్లో పనిచేస్తున్న నలుగురు పిల్లలను గుర్తించారు. వారి తల్లిదండ్రులతో భైంసా సబ్ డివిజన్ ఆపరేషన్ ముస్కాన్ సబ్ ఇన్‌స్పెక్టర్ నారాయణ్‌సింగ్ కౌన్సెలింగ్ నిర్వహించి బడిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ ముస్కాన్ హెడ్ కానిస్టేబుల్ సిలార్, రమేశ్, కానిస్టేబుళ్లు హరీశ్, మహిళా కానిస్టేబుల్ అనుప్రియ, బాలల పరిరక్షణ సిబ్బంది సగ్గం రాజు, కరుణశ్రీ పాల్గొన్నారు.

ఏం తమాషా చేస్తున్నారా?

- గుడిహత్నూర్ ఎంపీడీవో అబ్దుల్ హై పై కలెక్టర్ సీరియస్
- ప్రజాపాలన సేవా కేంద్రాన్ని నిర్లక్ష్యం చేయవద్దు..
- కంప్యూటర్ ఆపరేటర్ లేకపోవడంపై ఆగ్రహం
- విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక
- ప్రజలకు అందుబాటులో ఉండి దరఖాస్తులు తీసుకోవాలి..

ప్రజాపాలన సేవా కేంద్రం ఆపరేటర్ ఎక్కడ అని ఎంపీడీవో అబ్దుల్ హైను ప్రశ్నిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

గుడిహత్నూర్, జూలై 15 : '' తమాషా చేస్తున్నారా? ప్రజాపాలన సేవా కేంద్రం నిర్వహణపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు..'' అని కలెక్టర్ రాజర్షి షా ఎంపీడీవో అబ్దుల్ హైపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిహత్నూర్ ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయం ఎదుట ప్రజాపాలన సేవా కేంద్రం బోర్డు లేకపోవడం, ఆపరేటర్ కూడా లేకపోడంతో ఎంపీడీవో అబ్దుల్ హైపై మండిపడ్డారు. ఇలాంటి పొరపాట్లు జరగకుండా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని మన గ్రోమోర్ ఫర్టిలైజర్ షాపు, పీఏసీఎస్‌లలో ఉన్న ఎరువుల గోదాములను కలెక్టర్ తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఎరువులను సక్రమంగా అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండె, మండల వ్యవసాయాధికారి రేవతి, తహసీల్దార్ కవితారెడ్డి, ఏఈవోలు వెంకటి, శ్రీధర్, కార్యదర్శి కేంద్రె పండరి ఉన్నారు.